## ప్రజారంజక పాలన చూసి

# కేసీఆర్‌ను ఆశీర్వదించండి

- మీలో ఒకడిగా ఉన్నా... కోట్లలో అభివృద్ధి చేశా
- ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య
- రామానగరంలో ప్రచారం ప్రారంభం
- అడుగడుగునా ఘనస్వాగతం పలికిన ఓటర్లు



సండ్రకు ఘనస్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు, మహిళలు

సత్తుపల్లి రూరల్, నవంబర్ 3 : తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లకాలంలో ఎవరూ చేయలేని అభివృద్ధిని సీఎం కేసీఆర్ చేసి చూపారని.. ప్రజారంజక పాలన చూసిన ప్రజలందరూ కేసీఆర్‌ను ఆశీర్వదించి మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని రామానగరంలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, మహిళలు, అభిమానులు పెద్దసంఖ్యలో పూలు చల్లి ఎమ్మెల్యే సండ్రకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. 2009 ఎన్నికల సమయంలో రామానగరం నుంచే ప్రచారం ప్రారంభించానని.. ఈ ప్రాంతం తనకు సెంటిమెంట్ అని ఏ కార్యక్రమం చేపట్టినా ఇక్కడి నుంచే చేస్తానని మీ అందరికీ తెలుసని వివరిస్తూ తనను మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి నియోజకవర్గ ప్రజలు ఆదరించారని...మరోమారు సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో ఎన్నికల బరిలో దిగానని... ఎమ్మెల్యేగా గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. రాష్ట్రంలో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు కేసీఆర్ పాలనలోనే మేలు జరిగిందని అన్నారు. వచ్చే ఎన్నికల బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో సౌభాగ్యలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతినెలా రూ.3వేలు, గ్యాస్ రూ.400లకే, రైతుబీమా తరహాలో ప్రతి కుటుంబానికి కేసీఆర్ బీమా రూ.5లక్షలు ఇచ్చేలా రూపొందించారని, పింఛన్లు రూ.6వేలు, రైతులకు రైతుబంధు రూ.16వేలు, రేషన్ లబ్దిదారులకు సన్నబియ్యం అంశాలను మ్యానిఫెస్టోలో చేర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ ఎన్నికల్లో గెలిస్తే తప్పకుండా వాటిని అమలుచేస్తారని ప్రజలకు వివరించారు. నన్ను గెలిపించండి...ఖచ్చితంగా నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. నియోజకవర్గాన్ని రూ.1000కోట్లతో అభివృద్ధి చేశానని ఓటు అడిగే హక్కు నాకు మాత్రమే ఉందని మీలో ఒకడిగా ఉన్నా కోట్లలో అభివృద్ధి చేశా... నన్ను ఆదరించి ఈసారి ఎన్నికల్లో నాల్గవసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ప్రచారంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, సర్పంచ్ వేల్పుల కళావతి, ఎంపీపీ దొడ్డా హైమావతి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు యాగంటి శ్రీనివాసరావు, హరికృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, రఫీ, చంటి, వెంకటేశ్వరరావు, రమేష్‌రెడ్డి, కృష్ణమూర్తి, పెద్దిరాజు, దామోదర్‌రెడ్డి, వెంకటరెడ్డి, అప్పారావు, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రజా ఆశీర్వాద సభావేదిక ముస్తాబు

**సభా ప్రాంగణానికి ప్రజలు త్వరగా చేరుకోవాలి**

**ఏర్పాట్ల పరిశీలనలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**



ఖమ్మంలో సభా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి అజయ్, చిత్రంలో ఎంపీ నామా, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం

ఖమ్మం, నవంబర్ 3: ఖమ్మం నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఎంపీ నామా నాగేశ్వరరావుతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. ఇదే రోజు ఖమ్మంతో పాటు కొత్తగూడెంలోనూ సీఎం సభ ఉంటుందన్నారు. తనతో పాటు జిల్లా నుంచి పోటీ చేస్తున్న ఇతర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సభను విజయవంతం చేస్తామన్నారు. ప్రజలు త్వరగా సభా ప్రాంగణానికి చేరుకోవాలని కోరారు. ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూసిన రైతు వ్యతిరేక బిల్లులను నాడు బీఆర్ఎస్ ఎంపీలు వ్యతిరేకించారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బీఆర్ఎస్ రైతు వ్యతిరేక బిల్లులకు అనుకూలమని ప్రచారంచేయడం కేవలం అజ్ఞానమేనన్నారు. ఖమ్మం సీఎం సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. పర్యటనలో డీసీసీబీ చైర్మన్ కురాకుల నాగభూషణం, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పార్టీ నాయకులు ఆర్జేసీ కృష్ణ, అమరగాని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. తొలిరోజు ఎనిమిది నామినేషన్లు

**ఖమ్మంలో మూడు, కొత్తగూడెం, పాలేరుల్లో రెండు, ఇల్లెందులో ఒకటి..**

**పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, మధిరల్లో నిల్**

ఖమ్మం, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కీలక ఘట్టం మొదలైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గొంటిమల్ల సాయికుమార్, కాటేపల్లి శైలజ నామినేషన్ దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గం నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ తరపున పసుపులేటి శ్రీనివాసరావు, స్వతంత్ర అభ్యర్థిగా బుడగ జంగం సాయిలు నామినేషన్ వేశారు. వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో ఒక్క నామినేషను కూడా దాఖలు కాలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా శ్రీమండి ఉదయ్‌కుమార్, గుండపునేని సతీశ్ నామినేషన్లు దాఖలు చేశారు. ఇల్లెందు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పాలెబోయిన రవికుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో ఒక్క నామిషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ ప్రక్రియ ఈనెల 10 వరకు కొనసాగుతుంది. ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల దాఖలుకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు అభ్యర్థులు ఆయా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ల్లో సంప్రదించవచ్చు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో కొందరు అభ్యర్థులు మంచిరోజు, ముహూర్తాలు చూస్తుండగా మరికొందరు పేరు బలం, సెంటిమెంట్ అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

# కేసీఆర్ సహకారంతోనే మధిర అభివృద్ధి

- ఈ సారి నన్ను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా తీర్చిదిద్దుతా..
- బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే రూ.400కే గ్యాస్ సిలిండర్
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి కమల్‌రాజు



భవన నిర్మాణ కార్మికులను ఓటు అభ్యర్థిస్తున్న లింగాల కమల్‌రాజు

మధిర, నవంబర్ 2 : సీఎం కేసీఆర్ సహకారంతోనే మధిర నియోజకవర్గం అభివృద్ధి చెందిందని జడ్పీ చైర్మన్, బీఆర్ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజు స్పష్టం చేశారు. ఈ సారి తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింతగా తీర్చిదిద్దుతానని అన్నారు. మధిర పట్టణంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. 9, 10 వార్డుల్లో గడపగడపకూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.కోట్లాది నిధులతో బీఆర్ఎస్ ప్రభుత్వం మధిరలో అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు. ఇప్పటికే 100 బెడ్ల ఆసుపత్రి సహా ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మినీ ట్యాంక్‌బండ్, ఇండోర్ స్టేడియం వంటివి నిర్మించినట్లు గుర్తుచేశారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 24 గంటలపాటు విద్యుత్ సరఫరా చేస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలందరికీ రూ.400కే గ్యాస్ సిలిండర్ అందించనున్నట్లు చెప్పారు. తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ సన్నబియ్యం సరఫరా చేస్తామని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15 లక్షలకు పెంచుతామని చెప్పారు. అలాగే, కేసీఆర్ బీమా పథకం కింద ప్రతి ఇంటికి రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు కనుమూరి వెంకటేశ్వరరావు, అరిగె శ్రీనివాసరావు, శీలం విద్యాలత, వెంకటరెడ్డి, మూడ్ ప్రియాంక, యన్నంశెట్టి అప్పారావు, మల్లాది వాసు, ధరావత్ మాధవి, జేవీ రెడ్డి, ఆవుల రాము, భాగ్యం, ఇందిర, కరివేద వెంకటేశ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

- ఇక్కడ ఉన్నన్ని సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలోనూ లేవు
- పాలేరు ప్రజల సంతోషమే ధ్యేయం: బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ



ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

కూసుమంచి (నేలకొండపల్లి), నవంబర్ 3: తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తోందని, అభివృద్ధిలో అద్భుతంగా దూసుకెళ్తోందని బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మన రాష్ట్రంలో ఉన్నన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేవని స్పష్టం చేశారు. పాలేరు నియోజవకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలన్నదే తన ధ్యేయమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు వారి పిల్లలను మంచిగా చదివించుకోవాలని సూచించారు. అందుకోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేలకొండపల్లి మండలంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. కొత్తకొత్తూరు, తిరుమలాపురం, అజయ్‌తండా, రాజారాంపేట, ముఠాపురం, కట్టకొమ్ముగూడెం తండా, శంకరగిరి తండా, రాజేశ్వరపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధించిన కేసీఆర్.. సీఎం అయ్యాక అద్భుతమైన పథకాలతో రాష్ట్రాన్ని తీర్చిదిద్దారని వివరించారు. గ్రామాల్లో కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో తెలంగాణ ముందున్నదని అన్నారు. ఇంతమంచి పథకాలు అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తాను కూడా వ్యక్తిగతంగా అన్ని గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తనవంతుగా తోడ్పాటునందించానని వివరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మహిళలు కందాళకు బొట్టు పెట్టి హారతిపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నం బ్రహ్మయ్య, వజ్జా రమ్య, నంబూరి శాంత తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616